# నాయీబ్రాహ్మణ సహకార సంఘము లి.

## బైలాలు



తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ లి.,
గన్‌ఫౌండ్రి, హైదరాబాద్ - 500001

Approved by Commissioner for Cooperation and Registrar of Cooperative Societies, Hyderabad
vide Rc.No. 3499/2017/Legal, dt.30-10-2017

Scanned by CamScanner

# నాయీబ్రాహ్మణ సహకార సంఘము లి.

## బైలాలు

1) సంఘము పేరు, :-

రిజిష్టరు నెం. మరియు తేది :-

2) చిరునామా :-

3) బ్యాంకుకు అనుబంధం చేయబడిన :-
తేదీ మరియు బ్యాంకు పేరు

4) తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్‌కు :-
అనుబంధం చేయబడిన తేది

5) అనుబంధం చేయబడిన ఇతర సంఘాలు :-

6) సంఘ వ్యావహారిక విస్తీర్ణము :-

Scanned by CamScanner

# నాయీబ్రాహ్మణ సహకార సంఘము లి.

## బైలాలు (ఉప నిబంధనావళి)

**1. సంఘం పేరు మరియు చిరునామా :**

..........................................నాయీబ్రాహ్మణ సహకార సంఘము లిమిటెడ్ అనే పేరుతో తెలంగాణా రాష్ట్ర సహకార సంఘాల చట్టం, 1964ను అనుసరించి తేది..................న రిజిస్టర్ నెం.....................తో రిజిస్టర్ చేయబడింది.

దీని చిరునామా ప్రస్తుతానికి ఈ క్రింది విధంగా వుంది.

గ్రామము..........................................మండలము.......................................

పోస్టు...................................................జిల్లా................................................

**రాష్ట్రం : తెలంగాణ** పిన్‌కోడ్ నెం.......................

**ఇట్టి సంఘమును ప్రతి 5 సం॥లకు ఒకసారి పునర్ నమోదు (రెన్యువల్) చేయించుకోవలెను.**

(సంఘం పేరులో గాని, చిరునామాలో గాని ఏదేని మార్పు సంభవించిన ఎడల ఆ విషయాన్ని తెలంగాణ రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ వారికి లేదా వారిచే అధికారమీయబడిన సంబంధిత అధికారికి 30 రోజులలోగా తెలియపరచవలెను. మార్పుకు సంబంధించి విరివిగా ప్రచారం చేయవలెను. సంఘం పేరు, చిరునామా, రిజిష్టర్ నెంబర్‌తో కూడిన బోర్డును సంఘ కార్యాలయం ముందు స్పష్టంగా కనబడునట్లు ఏర్పాటు చేయవలెను).

**2. వ్యాపార విస్తీర్ణము :** ఈ సంఘం యొక్క వ్యాపారం లేదా కార్యకలాపాలు దిగువ సూచించిన రెవెన్యూ గ్రామాలకు పరిమితమై వుండును.

| | |
|---|---|
| 1. | 5. |
| 2. | 6. |
| 3. | 7. |
| 4. | 8. |

**3. నిర్వచనములు :-** ఈ బైలాలలో ప్రయోగింపబడిన పదములకు అర్థం దిగువ సూచించిన విధంగా భావించుకోవాలి.

ఎ) 'చట్టం' అనగా తెలంగాణ రాష్ట్ర సహకార సంఘాల చట్టం, 1964 అని అర్థం

బి) 'నియమములు' అనగా తెలంగాణ రాష్ట్ర సహకార సంఘాల నియమాలు, 1964 అని అర్థం



Scanned by CamScanner

సి) బైలాలు (ఉపనిబంధనావళి) అనగా ఈ సంఘం యొక్క బైలాలు అని అర్థం

డి) రిజిస్ట్రార్ అనగా తెలంగాణ రాష్ట్ర సహకార సంఘముల రిజిస్ట్రార్ లేదా రిజిస్ట్రార్ యొక్క అధికారములు అప్పగించబడిన ఇతర అధికారి అని అర్థం

ఇ) రాష్ట్ర ప్రభుత్వం అనగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అని అర్థం

ఎఫ్) ఈ బైలాలలో నిర్వచింపబడక పోయినప్పటికి, ఉపయోగింపబడిన పదములకు తెలంగాణా రాష్ట్ర సహకార సంఘాల చట్టం, 1964లో ఏ అర్థం ఇవ్వబడినదో అదే అర్థములు ఇక్కడ కూడా పరిగణింపవలెను.

జి) కుటుంబం అనగా భర్త, భార్య, పెళ్ళికాని కుమార్తె లేదా కుమారుడు మరియు ఆధారితులు అని అర్థం

**4. సంఘ ఉద్దేశ్యములు :-**

ఎ) సభ్యులలో పొదుపు, స్వయం సహాయము పెంపొందించుట.

బి) పనిముట్లు (ఆస్తులు) సాధన సామగ్రి కొనుటకు అగు పెట్టుబడి నిమిత్తము, గవర్నమెంటు సహాయముతో సేకరించిన (మొత్తము) ఋణములను, సబ్సిడీని సభ్యులకు పంచుట.

సి) ప్రభుత్వ శాఖలకు, స్థానిక సంస్థలకు, హాస్పిటళ్ళకు సంబంధించిన లేక ఏ యితర ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన వారి క్షురకర్మ చేయుట.

డి) తలనూనెలు, షాంపులు, సబ్బులు మొదలగునవి మరియు క్షౌరవృత్తి, వాయిద్యమునకు అవసరమైన వస్తువులను ఏకమొత్తంగా కొని సభ్యులకు పంపిణీ చేయుట

ఇ) సహకార సిద్ధాంతములు, సూత్రముల గుర్తించి విస్తృతముగా సభ్యులలో ప్రచారముచేసి వారికి ఆకళింపు చేయుట.

ఎఫ్) నాయీబ్రాహ్మణ వృత్తికి సంబంధించిన కోర్సులను సభ్యులకు యిప్పించి, వృత్తిపరముగా వారిని ఆధునీకరించుట.

జి) పైనుదహరించిన లక్ష్యముల సాధనకై అవసరమగు పరిస్థితులను కల్గించుట.

హెచ్) వృత్తిపరముగా (క్షురకర్మ, వాయిద్య) సభ్యులకు తగిన, లాభదాయకమైన వ్యాపారమును సభ్యులకు ఇతోధికముగ ఏర్పాటు చేయుట.

ఐ) సభ్యుల శ్రేయస్సుకు అవసరమైన కార్యక్రమాలను చేపట్టుట మరియు సేవలు అందచేయుట.

**5.** **సభ్యుల బాధ్యత (పూచీ):-** సంఘ సభ్యుల బాధ్యత వారు చెల్లించిన వాటాధనమునకు మాత్రమే పరిమితమై ఉండును.

**6. సంఘ వాటాధనము :**

సంఘ వాటాధనము వాటా ఒక్కంటికి రూ..........చొప్పున ...................మొత్తం వాటాలకు



Scanned by CamScanner

రూ....................లు మొత్తము ఉండవలెను.

**7. సభ్యత్వమునకు అర్హత :**

ఏ వ్యక్తి అయిన 18 సంవత్సరాలు పైబడి, స్థిర చిత్తముగలవారై సంఘ వ్యవహారికవిస్తీర్ణములో నివాసము కలిగియుండి సంఘ సభ్యత్వమునకు దరఖాస్తుచేయుటకు పూర్వము కనీసము ఒక సంవత్సరమైనా నాయీ(బ్రాహ్మణ వృత్తి నిర్వహించుచున్న యెడల సభ్యుడుగా చేర్చుకొనుటకు అర్హుడు.

**7ఎ) సంఘ సభ్యత్వమునకు అనర్హతలు :**

1) ఈ దిగువ పరిస్థితులలో ఎవరేని వ్యక్తి సహకార సంఘంలో సభ్యత్వం పొందుటకు మరియు సభ్యునిగా కొనసాగుటకు అనర్హుడగును.

ఎ) దివాళాదారుగా ప్రకటించాలని దరఖాస్తు పెట్టుకొని ఉన్నా లేక విముక్తి పొందని దివాళాదారు అయినా

**7ఎఎ)** ఉపనిబంధన 6లో చెప్పబడిన అర్హతలు లేకున్నా, లేక

బి) నీతి బాహ్యమైన నేరానికి శిక్షను అనుభవిస్తున్నా లేక శిక్ష గడువు ముగిసిన తేదీ నుండి మూడు సంవత్సరాలు గడిచి ఉండక పోయినా, లేక

సి) సంఘంలో లేదా దాని ఆర్థిక బ్యాంక్‌లో లేదా ఆ ఆర్థిక బ్యాంకు నుండి సహాయం పొందిన ఇతర సంఘంలో వేతనోద్యోగిగా పని చేస్తున్నా, లేక

డి) ఈ చట్టం క్రింద సభ్యత్వం నుండి బహిష్కరింపబడి, అట్టి బహిష్కరణ తేదీ నుండి ఒక సంవత్సర కాలం పూర్తికాకపోయినా, లేక

ఇ) సంఘ లక్ష్యాలకు లేదా ప్రయోజనాలకు విరుద్ధమైన వ్యాపారంగా రిజిస్ట్రార్‌చే సాధారణ లేక ప్రత్యేక ఉత్తర్వు ద్వారా ప్రకటింపబడిన వ్యాపారం చేయుచున్నా, లేక

ఎఫ్) ఈ బైలాలలో చెప్పబడిన విధంగా సభ్యుడు ఒక సంవత్సరంలో కనీస వ్యాపారమును నిర్వహించుటలో లేదా కనీస సేవలను వినియోగించుకోవడంలో విఫలమైనా, లేక

జి) వరుసగా రెండు సర్వసభ్య సమావేశాలకు ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరైనా, లేక

హెచ్) సంఘానికి బైలాలలో పేర్కొన్న విధంగా తనకు సంబంధించిన సమాచారం ఇవ్వడంలో విఫలమైనా, లేక

ఐ) సంఘ డైరెక్టర్‌గా లేక కమిటీ సభ్యునిగా ఉన్న / ఉండిన వ్యక్తి తదుపరి వచ్చిన కమిటీకి సంఘ రికార్డులను అప్పగించడంలో విఫలమైనా

2) ప్రత్యేక వర్గమును ఉద్ధరించే నిమిత్తమై ప్రభుత్వం రాజపత్రంలో ప్రకటించడం ద్వారా ఏర్పాటు చేయబడే



Scanned by CamScanner

సంఘాలలో సభ్యత్వం పొందగోరు వ్యక్తులకు సబ్ సెక్షన్(1) క్లాజు 'బి' లోని నిబంధనలు వర్తించవు

3) సభ్యత్వం అర్హతలు లేకుండా సభ్యత్వం పొంది ఉన్నా లేక సబ్ సెక్షన్ (1)లో చెప్పబడిన అనర్హతలతో సభ్యుడిగా కొనసాగుతున్నా అట్టి సభ్యుడిని మహా జనసభ తనంతతాను గాని లేక ఎవరేని సభ్యుడు లేదా సమాఖ్య సంఘం లేదా ఆర్థిక బ్యాంక్ ప్రతిపాదన మేరకు ఒక తీర్మానం ద్వారా తొలగించవచ్చును

**8. సభ్యత్వ దరఖాస్తు :-**

సంఘంలో సభ్యత్వాన్ని తీసుకోగోరే వ్యక్తి సంఘ కార్యదర్శి పేరుతో దరఖాస్తు చేసుకొనవలెను.

సంఘ కార్యదర్శి తనకు అందిన సభ్యత్వ దరఖాస్తులను తగు నిర్ణయమునకై పాలక వర్గానికి సమర్పించవలెను. సభ్యత్వ అర్హతలు కలిగి ఉన్న వ్యక్తికి సంఘం తన సేవలను అందించగలిగిన స్థితిలో ఉన్నప్పుడు మాత్రమే పాలకవర్గం సభ్యత్వము ఇవ్వవలెను. సభ్యత్వం ఇవ్వడానికి నిరాకరింపదలిచిన ఎడల అందుకుగల కారణములను పాలకవర్గ తీర్మానమును చేసిన 15 రోజుల లోపుగాని, లేదా సభ్యత్వం కొరకు దరఖాస్తు చేసుకున్న తేదీనుండి 60 రోజుల లోపుగాని వ్రాత పూర్వకముగా సదరు వ్యక్తికి రిజిస్టర్ పోస్ట్ ద్వారా తెలియపరచవలెను. సంఘం ఒక వ్యక్తిని సభ్యునిగా చేర్చుకున్న వెంటనే అతని పేరును సంబంధిత రిజిష్టర్‌లో నమోదు చేయవలెను. మరియు అతని ఫోటోను అడ్మిషను రిజిస్టరులో అతికించి, సభ్యుని సంతకం తీసుకొనవలెను. ప్రతి సభ్యునికి సంఘ కార్యదర్శి, అధ్యక్షుడు సంతకం చేసి, సంఘ సీలుతో కూడిన ఫోటో గుర్తింపు కార్డును అందచేయవలెను. సభ్యుడు, ఏదేని కారణం వలన సభ్యత్వము నుండి తొలగినయెడల అడ్మిషన్ రిజిస్టరులో ఎర్ర సిరాతో సభ్యత్వ రద్దు నమోదు చేయవలెను.

**9. సంఘం నుండి సభ్యుడు సేవలు పొందుటకు అర్హత :**

1) ఒక సంఘంలో సభ్యత్వం పొందిన వెంబడే ఆ సంఘం ద్వారా లభ్యమయ్యే అన్ని సేవలను, కమిటీకి దరఖాస్తు చేసుకున్న పిదప సేవల లభ్యతను బట్టి, పొందుటకు ప్రతి సభ్యుడు అర్హుడు.

2) ఏదేని సభ్యునికి ఏదేని సేవ నిరాకరించబడితే లేక అతని దరఖాస్తుపై కమిటీ నిర్ణయాన్ని దరఖాస్తు తేదీ నుండి 30 రోజుల లోపు అతనికి తెలియపరచకపోతే నిరాకరణ తేదీ నుండి 30 రోజుల లోపు లేదా సంఘానికి దరఖాస్తు చేసిన తేదీ నుండి 60 దినములలోపు సభ్యుడు ఇబ్బంది నివారణ నిమిత్తమై రిజిస్ట్రారుకు దరఖాస్తు చేసుకోవచ్చును.

3) ఏదేని సేవ యొక్క నిరాకరణ సబబు కాదని, అనుచితమైనదని లేక పక్షపాతంతో చేసినట్టిదని రిజిస్ట్రార్ సంతృప్తి చెందితే, కమిటికీ తన అభ్యర్థనను తెలియజేయడానికి అవకాశం ఇచ్చిన తరువాత, ఆ సేవను అందించాల్సిందిగా ఉత్తర్వు ద్వారా కమిటీని ఆదేశించవచ్చు.

**10. సభ్యుని యొక్క హక్కులు :-**



Scanned by CamScanner

1) సంఘం కల్పించు సౌకర్యములు, సేవలు పొందే హక్కు

2) అర్హతలు కలిగి యున్నచో ఓటు వేయు లేదా పాలకవర్గానికి పోటీచేయు హక్కు

3) సంఘ బైలాలు, ఆస్తి అప్పుల పట్టిక, లాభనష్టాల ఖాతా, వర్తకపు ఖాతా, సభ్యుల జాబితా మొదలైన వాటిని సంఘ అవరణలో, కార్యాలయపు పనివేళల్లో ఉచితంగా పరిశీలించే హక్కు

4) తనకు సంబంధించిన లావాదేవీలను వ్రాసి ఉంచినట్టి పుస్తకములు లేదా రికార్డుల భాగములను తనిఖీ చేయుహక్కు

5) లిఖిత పూర్వకంగా కోరుతూ, నిర్ణయింపబడిన రుసుమును చెల్లించుట ద్వారా పైన తెలిపిన ఏదేని పత్రముల నకలును రుసుమును చెల్లించిన నాటినుండి 30 రోజులలోపు పొందే హక్కు

**11. సభ్యుని గరిష్ట వాటాల పరిమితి మరియు ప్రవేశ రుసుము :**

ప్రతి సభ్యుడు కనీసము ఒక పూర్తి షేరునైనా తీసుకొనవలెను. ఏ సభ్యుడు కూడా సంఘ మూలధనములో 1/5 వంతుకు మించి వాటాలను కలిగి వుండరాదు. వాటాల కొనుగోలు సమయంలో నిర్ణీత ప్రవేశ రుసుమును చెల్లించవలెను. అదే విధంగా వాటాల బదలాయింపు సమయంలో కూడా నిర్దేశించిన ప్రకారము ప్రవేశ రుసుమును చెల్లించవలెను.

**12. నామ నిర్దేశము (నామినీ)**

ఎ) సంఘ సభ్యుడు తాను ఒకవేళ మరణిస్తే, తన తదనంతరం తనకు రావలసిన వాటాధనం, వడ్డీ తదితర మొత్తాలు ఎవరికి సంక్రమించాలో ఉదహరిస్తూ ఫారం 'ఐ'లో నిర్దేశించిన ప్రకారం ఒకరిని గాని లేదా అంతకన్నా ఎక్కువ మందిని గాని నామినిగా నియమించవచ్చు. తన జీవితకాలంలో ఆ నామినేషన్‌ను సవరించవచ్చు లేదా పూర్తిగా రద్దుచేయవచ్చు. నామినేషన్ ఏర్పాటు, సవరణ, రద్దు విషయంలో సదరు పత్రంపై ఇద్దరు సాక్షుల సమక్షంలో సభ్యుడు సంతకంచేసి ఉండడమేగాక నామినేషన్ పుస్తకంలో రికార్డు కాబడి ఉంటేనే చెల్లుబాటు అవుతాయి.

బి) సభ్యుడు నామినీని నియామకం చేసి ఉండని ఎడల అతని మరణానంతరం సంఘం నిబంధనల ననుసరించి పాలకవర్గం వారసున్ని నిర్ణయించి అతనికి మరణించిన సభ్యునికి చెందిన వాటాధనం, ఇతర మొత్తాలను చెల్లించవలెను. అయితే ఈ విధంగా చెల్లించే ముందు కనీసం ఇద్దరు సభ్యుల నుండి సదరు చెల్లింపు మేరకు జామీను తీసుకొనవలెను.

**13. షేర్ సర్టిఫికెట్ :**

ఎ) సంఘములో ప్రతి సభ్యుడు తాను తీసుకున్న షేర్ల విలువను పూర్తిగా చెల్లించివేసిన తరువాత షేరు సర్టిఫికెటును అధ్యక్షుడు, కార్యదర్శి సంతకములుచేసి ఆ విధముగా చెల్లించిన ప్రతి సభ్యునకు యివ్వవలెను.



Scanned by CamScanner

బి) షేర్ సర్టిఫికెట్ పోయిన సందర్భంలో పాలకవర్గం సదరు షేర్ సర్టిఫికెట్‌కు సంబంధించిన వివరములను ప్రకటనల ద్వారా తెలియపరిచి, సభ్యునికి డూప్లికేట్ సర్టిఫికెట్ ఇవ్వవచ్చును. డూప్లికేట్ సర్టిఫికెట్ జారీ విషయంలో ఎవరైనా ఆక్షేపణ తెలిపిన ఎడల దానిపై పాలకవర్గం నిర్ణయమే తుది నిర్ణయం. సర్టిఫికెట్ శిథిలావస్థలో ఉన్నప్పుడు లేదా చినిగిపోయి ఉన్నప్పుడు సభ్యుడు దానిని సంఘానికి అందజేయాలి. అలాంటి వాటిని పాలక వర్గం రద్దు పరిచి, దాని స్థానంలో వేరొక సర్టిఫికెట్‌ను ఇవ్వవచ్చును. అయితే సభ్యుడు నిర్ణీత రుసుమును చెల్లించాల్సి ఉంటుంది.

**14. సభ్యుని యొక్క వాటాలను లేక వడ్డీలను బదలాయించుట :**

కనీసం ఒక సహకార సంవత్సరం పూర్తయితేనే తప్ప ఏ సభ్యుడూ తన వాటాలను గాని, వాటిపై అతనికున్న వడ్డీలను గాని ఇతరులకు బదలాయింపు చేయుటకు అనుమతించబడదు. బదలాయింపు పొందేవారు కూడా సంఘంలో సభ్యుడై ఉండాలి. అట్టి బదలాయింపుకు పాలకవర్గ అనుమతితో పాటు, బదలాయింపు పొందిన వారిపేరు వాటాల బదిలీ రిజిష్టర్‌లో నమోదు చేయబడితేనే తప్ప చెల్లుబాటు కాదు.

**14.(ఎ) సభ్యుడు తన వాటాధనమును వాపసు తీసుకొనుట :**

1) ఏ సభ్యుడైనా తాను సంఘంలో చేరిన నాటినుండి ఒక సంవత్సరంలోపు తన వాటాధనమును వాపసు తీసుకొనుటకు గాని, సభ్యత్వ విరమణ కొరకు రాజీనామా చేయుటకు గాని అనుమతించబడదు. నిర్ణీత గడువు ముగిసిన పిదప పాలకవర్గం అనుమతితో సభ్యుడు తన వాటాధనమును వాపసు తీసుకోవడం గాని లేదా రాజీనామా చేయడంగాని చేయవచ్చును. అయితే అతను సంఘమునకు అప్పు రూపంలో గాని లేదా ఇతర రూపంలోగాని బాకీ పడి ఉండకూడదు. ఒకసారి వాటాధనమును వాపసు తీసుకున్న తరువాత తిరిగి ఒక సంవత్సరం గడిచేంతవరకు సభ్యత్వమునకు అర్హుడుకాదు.

2) తన అప్పులను పూర్తిగా చెల్లించడంతోపాటు ఇతరుల అప్పులకు హామీగా లేని సభ్యుడు రాజీనామా చేయాలనుకుంటే తన రాజీనామా పత్రమును రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా సంఘమునకు పంపవలెను. అయితే పాలకవర్గం ఆమోదించిన తేదీనుండి మాత్రమే ఆ రాజీనామా అమలులోనికి వచ్చును.

3) రాజీనామా చేసిన సభ్యునికి సంబంధించిన వాటాధనమును మరియు ప్రకటించబడిన డివిడెండ్‌ను చెల్లించవలెను. అయితే అతని నుండి సంఘానికి రావలసిన మొత్తమేదైనా యున్న ఎడల మినహాయించుకొని మిగిలిన మొత్తాన్ని మాత్రమే చెల్లించవలెను.

4) ఏ సంవత్సరంలోనైనా వాపసు చేసే వాటాధనం మొత్తం గత సంవత్సరపు మార్చి 31 తేదీన సంఘంలో ఉన్న మొత్తం వాటాధనంలో పదింట ఒక వంతుకు మించి ఉండరాదు.



Scanned by CamScanner

**15. గత సభ్యుని బాధ్యత :-**

ఎ) సభ్యుడు రాజీనామా ద్వారా సభ్యత్వం నుండి విరమించుకోవడం, లేదా అనర్హతలు కలిగి ఉన్న కారణంగా సభ్యత్వం నుండి బహిష్కరించడం, లేదా సభ్యుడు మరణించడం వల్ల ఒక సభ్యుని సభ్యత్వం ముగిసిపోతుంది. అయినప్పటికి ఆ సభ్యుల బాధ్యత మాత్రం ముగిసిపోదు. సభ్యత్వం నుండి విరమించుకున్న నాటి నుండి రెండు సంవత్సరాల కాలపరిమితి ముగిసేవరకు సంఘ రుణములకు అతని బాధ్యత కొనసాగుతుంది. అలాగే మరణించిన సభ్యుని ఎస్టేట్ పై భారం సభ్యుడు మరణించిన నాటి నుండి రెండు సంవత్సరాల కాలపరిమితి వరకు కొనసాగును.

బి) పైన చెప్పబడిన దానితో నిమిత్తం లేకుండా తెలంగాణా రాష్ట్ర సహకార సంఘాల చట్టం, 1964లోని 64వ సెక్షన్ ప్రకారం సంఘాన్ని మూసివేయాలని ఉత్తర్వులు జారీ అయిన సందర్భంలో అట్టి ఉత్తర్వుల జారీకి రెండు సంవత్సరాలలోపు సభ్యత్వం నుండి విరమించుకున్న గత సభ్యుని బాధ్యత లేదా మరణించిన సభ్యుని యొక్క ఎస్టేట్ బాధ్యత లిక్విడేషన్ ప్రక్రియ పూర్తియగునంతవరకు కొనసాగును. అయితే ఆ బాధ్యత సందర్భాన్ని బట్టి సభ్యత్వం నుండి విరమించుకున్న నాటికి లేదా సభ్యుడు మరణించిన నాటికి ఉన్న సంఘపు రుణములకు మాత్రమే పరిమితమై ఉండును.

**16. అనర్హుడైన సభ్యున్ని తొలగించుట :-**

ఎవరైనా వ్యక్తి సభ్యత్వ అర్హతలు లేకున్నా లేదా అనర్హతలు కలిగి ఉన్నా సంఘంలో సభ్యత్వం పొంది, కొనసాగుచుండిన ఎడల అతనిని మహాజన సభ తనంత తానుగా గాని లేక సంఘం యొక్క ఎవరేని సభ్యుడు లేదా ఫైనాన్సింగ్ బ్యాంక్ అభ్యర్థనపై గాని తొలగించవలెను.

అయితే ఆ సభ్యుడిపై వచ్చిన ఆరోపణలపై వివరణ ఇచ్చుటకు అతనికి అవకాశం ఇచ్చిననే తప్ప అతనిని తొలగించరాదు. సభ్యున్ని తొలగిస్తూ చేసిన తీర్మానపు ప్రతిని సదరు వ్యక్తికి అందజేసిన పిదపనే అతడు ఆ సంఘ సభ్యత్వం నుండి విరమించినట్లు భావించాలి.

**16(ఎ) సభ్యుని బహిష్కరణ :** ఏదేని సభ్యుడు సంఘాన్ని మోసం చేసినా లేక సంఘ ప్రయోజనాలకు భంగం వాటిల్లేలా నడుచుకున్నా లేక అతని స్వభావం సంఘ ప్రయోజనాలకు నష్టం కలిగించేలా ఉంటే అతనిని తొలగించవలసిన అవసరముందని భావించిన మహాజన సభ ఆ సభ్యున్ని బహిష్కరించవచ్చు. అయితే మహాజన సభకు హాజరైన మెజారిటీ సభ్యులలో 2/3 వంతుకు తగ్గని సభ్యులు ఓటు చేసి తీర్మానం చేయాల్సి ఉంటుంది. సభ్యునికి అతని అభ్యర్థనను తెలుపుకునే అవకాశము ఇచ్చిన పిదపనే బహిష్కరించాలి. సభ్యున్ని బహిష్కరిస్తూ చేసిన తీర్మానాన్ని ఆ సభ్యునికి పంపించాలి. కాపీ రిజిస్ట్రారు గారికి పంపించాలి.

ఆ విధంగా తొలగింపబడిన సభ్యునికి సంఘం ఇవ్వవలసిన యావత్తు సొమ్మును, అతని నుండి సంఘానికి



Scanned by CamScanner

రావలసిన మొత్తాన్ని మినహాయించుకొని మిగతా సొమ్మును ఇచ్చివేయవలెను. అయితే సంఘం చెల్లించవలసిన రుణములకు బైలాలో చెప్పబడిన ప్రకారం తొలగించబడిన సభ్యుడు తనను తొలగించిన తేదీ నుండి రెండు సంవత్సరముల వరకు పూచీ వహించవలసి ఉండును.

## 17. సంఘ నిధులు :-

సంఘం సాధారణంగా ఈ క్రింద పద్ధతులలో నిధులను సేకరించవచ్చును.

1) సభ్యుల నుండి వాటాధనం మరియు త్రిఫ్ట్ (పొదుపు) డిపాజిట్లు

2) ప్రవేశరుసుము మరియు బదిలీ రుసుము

3) సభ్యుల నుండి డిపాజిట్లు

4) ప్రభుత్వం నుండి వాటాధనం

5) ప్రభుత్వ రుణములు

6) రిజిస్ట్రార్ అనుమతితో ఇతర సంస్థల నుండి అప్పులు

7) విరాళములు

8) సబ్సిడీలు మరియు గ్రాంట్లు

9) జాతీయ మరియు వాణిజ్య బ్యాంకుల నుండి రుణములు

10) ఇతరములు

పై పద్ధతుల ద్వారా సేకరించిన నిధులను సంఘం తన ఉద్దేశ్యముల సాధన కొరకు వినియోగించవలెను. వెంటనే ఖర్చు చేయవలసిన అవసరం లేని నిధులను తెలంగాణా రాష్ట్ర సహకార సంఘాల చట్టం, 1964 కు లోబడి, మహాజన సభ చేసిన తీర్మానం మేరకు సంఘ మేనేజింగ్ కమిటి పెట్టుబడి పెట్టవలెను.

**గమనిక :** సంఘం చేయు మొత్తం అప్పులు సభ్యులు చెల్లించిన వాటాధనం మరియు క్షేమనిధి కలుపగా వచ్చిన మొత్తమునకు ....................రెట్లకు మించి ఉండరాదు. సభ్యేతరులనుండి రిజిస్ట్రారు అనుమతి పొందితేనే తప్ప డిపాజిట్లను సేకరించరాదు.

## 18. సంఘ నిర్వహణ :

సంఘ వ్యవహారాలను నడిపించుటకై తెలంగాణా రాష్ట్ర సహకార సంఘాల చట్టం, 1964 నిబంధనలను అనుసరించి పాలకవర్గ సభ్యులను మహాజనసభ ఎన్నుకుంటుంది. ఎప్పటికప్పుడు మహాజనసభ చేయు తీర్మానాలకు లోబడి సంఘ వ్యవహారాలను నడిపే అధికారం మేనేజింగ్ కమిటీకి ఉండును. కమిటీలో...............మంది



Scanned by CamScanner

సభ్యులు (21 మందికి మించకుండ) ఉండవలెను. ఎన్నికైన కార్యవర్గం (2) ఇద్దరికి మించకుండ కమిటీ సభ్యులుగా కో ఆప్ట్ చేసుకోవచ్చు. ఈ విధంగా కో–ఆప్ట్‌చేసుకున్న సభ్యులకు ఓటు చేయుటకు అర్హత ఉండదు.

**19. సంఘ ఎన్నికలు :**

తెలంగాణా రాష్ట్ర సహకార సంఘాల చట్టం, 1964 నియమములోని రూలు (22) ప్రకారము రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీచే ఎన్నికలు నిర్వహించుకోవలయును.

**19(ఎ) ఓటు హక్కు :** ఏ సభ్యుడైనా ఒక సహకార సంవత్సరంలో బైలాలో నిర్దేశించిన లేదా పాలకవర్గం నిర్ణయించిన కనీస వ్యాపారం చేయడంలో లేదా సేవలు పొందడంలో విఫలమైన ఎడల ఎన్నికలలో పోటీచేయుటకు గాని లేదా ఓటు చేయుటకు గాని అర్హుడు కాదు.

ఈ క్రింది అర్హతలు కలిగిన వారు మాత్రమే ఓటు హక్కు కలిగి ఉంటారు.

1. కనీసం మూడు వందల రూపాయల వాటాధనం తన పేరుమీద కలిగి ఉండాలి.
2. సంఘంలో సభ్యునిగా ప్రవేశించిన తేదీ నుండి ఎన్నికల అథారిటీచే ఎన్నికల ప్రకటన వెలువడే తేదీ నాటికి ఒక సంవత్సరం నిరవధిక కాలం పాటు సంఘ సభ్యుడిగా ఉండవలెను.
3. సంఘానికి చెల్లించవలసిన సొమ్ము మూడు మాసములకు మించి బకాయి పడి ఉండరాదు. అయితే బకాయిదారుల జాబితాను తయారుచేసి సంఘ మహాజనసభ జరుగుటకు ముందు మరియు ఎన్నికలకు ముందు సంఘ కార్యాలయపు నోటీసు బోర్డునందు ప్రకటించాలి.
4. ఈ చట్టం నిబంధనల క్రింద తొలగించబడిన కమిటీలో సభ్యుడిగా ఉండకూడదు.
5. ఈ చట్ట నిబంధనల ప్రకారం సంఘ ఎన్నికలను జరిపించడంలో ఏర్పాట్లు చేయడంలో విఫలమైన కమిటీలో సభ్యుడిగా ఉండి ఉండకూడదు.

**20. కమిటీ సభ్యత్వమునకు అనర్హతలు :-**

ఈ దిగువ వ్యక్తులు కమిటీ సభ్యులుగా ఎన్నుకోబడుటకు మరియు కమిటీ సభ్యులుగా కొనసాగుటకు అనర్హులు.

ఎ) సంఘ లేదా ఆర్థిక బ్యాంక్ వేతనోద్యోగికి సమీపబంధువైనా;

బి) సంఘానికి లేక మరే ఇతర సంఘానికి నగదు రూపంలోగాని లేక వస్తురూపంలో గాని బాకీ ఉండి నిర్దిష్ట కాలపరిమితిలోపు చెల్లించలేకపోయినా లేక పనిచేయని సంఘానికి ప్రతినిధిగా ఉన్నా లేక బకాయిపడి గడువులోపు చెల్లించకుండా అపరాధిగా మారిన సంఘానికి ప్రతినిధిగా ఉన్నా;

సి) ఏదేని డిక్రీ, నిర్ణయం, తీర్పు మేరకు అతనినుండి బకాయి పడిన మొత్తాన్ని వసూలు చేయాల్సి ఉన్నా;

డి) నిర్దేశింపబడిన పద్ధతిలో తప్ప సంఘము యొక్క కాంట్రాక్టులో లేదా పనిలో ప్రయోజనం పొందినా;



Scanned by CamScanner

ఇ) మతిస్థిమితం లేదని, మూగ, చెవిటి లేదా కుష్టురోగిగా అధికారిక న్యాయస్థానముచే ప్రకటింపబడినా,

ఎఫ్) సంఘానికి అనుకూలంగా లేక వ్యతిరేకంగా న్యాయవాదిగా హాజరవుతున్నా;

జి) సంఘ ఉద్యేశ్యాలకు, ప్రయోజనాలకు భంగం కలిగించే వ్యాపారంగా రిజిస్ట్రార్‌చే సాధారణ లేక ప్రత్యేక ఉత్తర్వు ద్వారా ప్రకటించబడిన వ్యాపారమును కొనసాగిస్తున్నా;

హెచ్) పౌర హక్కుల చట్టం, 1955 క్రింద నేరానికి జైలు శిక్షపడి ఉన్నా;

ఐ) గ్రామ పరిపాలనాధికారిగా లేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగిగా లేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధులను సహాయంగా స్వీకరిస్తున్న సంస్థలో ఉద్యోగిగా లేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అజమాయిషీలో పని చేస్తున్న సంస్థలో ఉద్యోగిగా ఉన్నా;

జె) నీతి బాహ్యమైన చర్యలో పాల్గొన్నందుకు క్రిమినల్ కోర్టుచే దోషిగా ప్రకటింపబడినా

**21. పాలకవర్గము :-**

ఎ) మహాజనసభ దఫదఫాలుగా ఆమోదించిన తీర్మానములకు లోబడి సంఘ పాలనా వ్యవహారములు పాలకవర్గముచే నిర్వహింపబడవలెను.

బి) తెలంగాణా రాష్ట్ర సహకార సంఘాల చట్టం, 1964లోని 22వ నిబంధన ప్రకారము ఎప్పటికప్పుడు జరుగు సవరణల ననుసరించి పాలకవర్గ సభ్యులు మహాజనసభచే ఎన్నుకొనబడవలెను. ఎన్నికైన పాలకవర్గ సభ్యులు ఐదు సంవత్సరములపాటు పదవిలో నుందురు. పాలకవర్గము గడువు, అధ్యక్షుడు పదవీ స్వీకారము చేసిన తేదీ నుండి ప్రారంభమై అధ్యక్షుని పదవీ కాలము ఐదు సంవత్సరములు అంతమగుటతో పూర్తి అగును. పాలకవర్గ సభ్యులు యావన్మంది ఒకేసారి నిర్ణీత కాలము వరకు అనగా ఐదు సంవత్సరములకు ఎన్నుకొనబడవలెను. అనుకోని పరిస్థితులలో యేర్పడిన ఖాళీలను, మిగతా పాలకవర్గ సభ్యులు తమ సమావేశములో కో ఆప్షన్ ద్వారా భర్తీచేసుకొనవలెను. అనుకొననివిధముగా ఏర్పడిన ఖాళీలలో కోఅప్ట్ చేసుకొనబడిన సభ్యులుకూడా, పాలకవర్గము పదవీకాలము ముగిసినపుడు తమ పదవులను కూడా ఖాళీచేయవలసియుండును. పాలకవర్గములో ఖాళీ లేక ఖాళీలున్నంత మాత్రమున పాలకవర్గము నిర్ణయములు చెల్లకుండాపోవు. పాలకవర్గ సభ్యుడెవరైనను తన స్థానమునకు రాజీనామా చేయాలనుకుంటే సంఘ సెక్రటరీకి ఉత్తరముద్వారా తెలియచేయవచ్చును. అయితే దానిని పాలకవర్గము ఏతేదీన ఆమోదించునో ఆ తేదీ నుండియే అది అమలులోనికి వచ్చును.

సి) పాలకవర్గములలో ఖాళీలు ఏర్పడినప్పుడు కో ఆప్షన్ ద్వారా ఎన్నుకొనుటకు పాలకవర్గ పదవీకాలం $2^{1/2}$ సం॥లకు తక్కువగా ఉండవలెను.



Scanned by CamScanner

**22. పాలకవర్గ సమావేశములు మరియు కోరం :**

పాలకవర్గం కనీసం మూడు నెలకొకసారి సమావేశం కావాలి. అవసరమనుకుంటే ఎక్కువ సార్లు కూడా సమావేశం కావచ్చును. మొత్తం పాలకవర్గ సభ్యులలో సగం కన్న ఎక్కువ మంది సభ్యుల హాజరు పాలకవర్గ సమావేశానికి కోరంగా ఉంటుంది. పాలకవర్గం ముందుకు వచ్చిన విషయాలన్నీ అధిక సంఖ్యాకుల ఓట్ల ప్రకారం నిర్ణయించవలెను. ఓట్లు సమానంగా వచ్చినప్పుడు అధ్యక్షుడు కాస్టింగ్ ఓటు (నిర్ణాయక ఓటు లేదా రెండవ ఓటు) ను కలిగి యుండును.

అధ్యక్షుని అనుమతితో పాలకవర్గం సమావేశములను సంఘ కార్యదర్శి ఏర్పాటు చేయవలెను. సభ్యులు లిఖిత పూర్వకంగా కోరినప్పుడుగాని లేదా రిజిస్ట్రార్ కోరినప్పుడుగాని, అట్టి తేదీ నుండి 15 రోజులలోపు పాలకవర్గ సమావేశమును ఏర్పాటు చేయవలెను. అయితే పాలకవర్గ సమావేశం ఏర్పాటుకు కనీసం ఏడు పూర్తిరోజుల వ్యవధితో నోటీసు ఇవ్వవలెను.

**గమనిక :** పాలకవర్గ సమావేశంలో అధ్యక్షుడు/ఉపాధ్యక్షుడు లేదా ఇతర పాలకవర్గ సభ్యుని విషయం చర్చకు వచ్చినప్పుడు సంబంధిత వ్యక్తులు సమావేశం నుండి నిష్క్రమించవలెను.

**23. పాలకవర్గం యొక్క అధికారములు విధులు :-**

1) సభ్యులను చేర్చుకొనుట

2) సభ్యులకు వాటాల కేటాయింపు మరియు వాటాల బదిలీ విషయంలో నిర్ణయములు తీసుకొనుట.

3) సెక్షన్ 21 క్రింద అనర్హతకు గురైన సభ్యుల తొలగింపుకు మహాజన సభకు సిఫారసు చేయుట

4) సెక్షన్ 21ఎ, 21ఎఎ, 21బి క్రింద అనర్హతకు గురైన పాలకవర్గ సభ్యుల తొలగింపుకు మరియు 21 బి కింద విరమించుకున్న కమిటీ సభ్యున్ని తిరిగి నియమించుటకు మహాజనసభకు సిఫారసు చేయుట మరియు వివిధ నివేదికలను మహాజనసభ ముందుంచుట;

5) రుణములు లేదా డిపాజిట్ల రూపంలో నిధులను సేకరించుట మరియు సేకరించిన నిధులను పెట్టుబడి పెట్టుట ;

6) సభ్యులను చేర్చుకున్న తేదీని అనుసరించి ముఖ్య కార్యనిర్వహణాధికారి సిఫారసుల మేరకు సభ్యులకు రుణములు, అడ్వాన్సులు మంజూరు చేయడంతో పాటు ఇతర సేవలు లేక సౌకర్యములను కల్పించుట ;

7) వార్షిక బడ్జెట్ కేటాయింపులకు లోబడి సంఘ వ్యాపారానికి అవసరమైన నిధులను మంజూరు చేసి, విడుదలచేయుట;

8) తమ పదవీ కాలపరిమితి ముగియక ముందే సంఘ నిబంధనావళిని అనుసరించి నూతన పాలక మండలికి



Scanned by CamScanner

ఎన్నికలు జరిపించుట;

9) చట్టంలో పేర్కొన్న ప్రకారం సాధారణ సమావేశాలను నిర్వహించుట ;

10) నిర్ణీత గడువులోగా సంఘ లెక్కలను ఆడిట్ చేయించి, ఆడిట్ రిపోర్టును మహాజనసభ ముందుంచుట;

11) సంఘ దైనందిన వ్యవహారాలకు సంబంధించి తగు నిర్ణయములు తీసుకొనుట;

12) పరిపాలన మరియు ఆపత్కాల నిధి లభ్యతనుబట్టి మహాజనసభ మరియు రిజిస్ట్రార్ ఆమోదంతో ఉద్యోగుల నియామకం, అర్హతలు, జీతభత్యములను నిర్ధారించుట;

13) సెక్షన్ 51 కింద విచారణ నివేదికనూ, సెక్షన్ 52 లేదా 53 కింద తనిఖీ నివేదికను, సెక్షన్ 50 కింద ప్రత్యేక ఆడిట్ నివేదికను నిర్ణీత గడువులోగా మహాజనసభ ముందుంచుట;

14) సెక్షన్ 50, 51, 52, 53ల కింద అందజేయబడిన నివేదికల్లో చూపబడిన తప్పులను సరిదిద్దుట.

15) సెక్షన్ 59 కింద సంఘం యొక్క ఎవరేని అధికారిని లేక ఉద్యోగిని పదవినుంచి తొలగించుట

16) ఈ చట్టం లేదా ప్రస్తుతం అమలులో ఉన్న ఏదేని ఇతర చట్టం కింద నేర ప్రవృత్తికి చెందిన అభియోగం మోపబడిన ఎవరేని వ్యక్తిపై దావా వేయుటకు చర్య చేపట్టుట

17) అపరాధుల జాబితాను తయారుచేసి, నిర్దేశించిన రీతిలో ప్రచురించి, దానిని మహాజనసభ ముందుంచుట;

18) రావలసిన రుణములను సమీక్షించి, వాయిదామీరిన రుణములు మరియు అడ్వాన్స్‌ల వసూలుకై న్యాయపరమైన చర్యలు గైకొనుట;

19) సంఘ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారమును పర్యవేక్షక మండలికి, రిజిస్ట్రారుకు, సంఘం అనుబంధింపబడిన ఫైనాన్సింగ్ బ్యాంక్‌కు మరియు సమాఖ్య సంఘమునకు అందజేయుట;

20) పాలకవర్గ సభ్యులకు, వారి దగ్గరి బంధువులకు మంజూరు చేసిన అప్పులు మరియు వారు సంఘంతో చేసిన వ్యాపారం, వారిలో బకాయి పడిన వారి జాబితా, వారి నుండి బకాయిలను వసూలు చేయుటకు చేపట్టిన చర్యలు మొదలగు వాటిని మహాజన సభ ముందుంచుట;

21) సంఘ వార్షిక నివేదిక, వార్షిక ఆర్థిక పట్టికలు, వార్షిక ప్రణాళిక మరియు బడ్జెట్‌ను మహాజనసభ ముందుంచుట;

22) సంఘ సభ్యులు, ఉద్యోగులు, అధికారులకు సహకార విద్య మరియు శిక్షణను అందించుటకు చర్యలు చేపట్టుట;

23) ఈ క్రింది అంశాలకు సంబంధించిన సమాచారమును, నివేదికలను, వివరణలను తయారు చేయించి మహాజన సభ ముందుంచుట;

ఎ) ఆస్తుల విక్రయం

బి) నగదు మరియు వస్తు నిల్వలలో లోటు



Scanned by CamScanner

సి) క్షేమనిధి, ఇతర నిధుల ఏర్పాటుతో పాటు నికర లాభమును వినియోగించుటకై రూపొందించిన ప్రతిపాదనలు,

డి) పారు బాకీల రద్దు,

ఇ) సభ్యత్వం నుండి తొలగింపు,

ఎఫ్) సహకార విద్యానిధి, పరిపాలన మరియు సాధర ఖర్చుల నిధి ఏర్పాటు

జి) సంఘ ఆశయాలకు విరుద్ధంగా పనిచేసిన సభ్యుల బహిష్కరణ,

హెచ్) ఆర్థిక బ్యాంక్ లేక ఇతర సంఘాలకు సంఘాన్ని అనుబంధించుట;

ఐ) ఆర్థిక బ్యాంక్ లేక ఇతర సంఘాలకు ప్రతినిధులను ఎంపిక చేయుట

జె) పర్యవేక్షక మండలి, అంతర్గత ఆడిటర్ల నియామకం, వారి నివేదికల పరిశీలన, అనువైన చర్యలను చేపట్టుట.

సంఘం, ఆర్థిక సంవత్సరం ముగిసిన నెల రోజుల వ్యవధిలో సంఘ ఆర్థిక స్టేట్‌మెంట్/రిటర్నులు తయారుచేసి సంబంధిత శాఖాధికారులకు సమర్పించి, ఆడిట్ చేయించుకోవలెను. లేనిచో పాలకవర్గము అనర్హతకు లోనవుతుంది.

**24. అధ్యక్షుని అధికారాలు విధులు :-**

1) సంఘ పరిపాలనా నిర్వహణకు సంబంధించి అధ్యక్షుడు సర్వాధికారి

2) సంఘం యొక్క ఆస్తులు, నగదు తదితర నిల్వలు అధ్యక్షుని ఆధీనంలో ఉండును. ఈ అధికారమును అధ్యక్షుడు కార్యదర్శికి అప్పగించవచ్చును.

3) సంఘం పేరిట వ్రాయబడు పత్రములు, దస్తావేజులు మొదలగునవి సంఘ అధ్యక్షుని తరపున వ్రాయవలెను.

4) సంఘ కార్యదర్శి లేనప్పుడు సంఘ పుస్తకములు వ్రాసి ఉంచవలసిన బాధ్యత అధ్యక్షునిదే;

5) కార్యదర్శితో పాటు సంఘంలో వ్రాసి ఉంచిన పుస్తకములలోని అంశములను అధ్యక్షుడు కూడా ధృవీకరించవలెను.

6) అధ్యక్షులు తన రాజీనామాను రిజిస్ట్రార్‌గారికి స్వయంగా గాని, రిజిస్టర్ పోస్టు ద్వారాగాని, సమర్పించవలెను. అట్టి రాజీనామా రిజిస్ట్రార్ గారు ఆమోదం తెలిపిన తేదీ నుండి అమలులోనికి వచ్చును.

**25. ఉపాధ్యక్షుడు :-**

సంఘాధ్యక్షుడు మూడు మాసములకు మించి సంఘ విధులకు హాజరుకానప్పుడు /అశక్తతతో హాజరుకాని ఎడల అధ్యక్షుని అధికారాలు తాత్కాలికంగా ఉపాధ్యక్షునికి సంక్రమించును. అధ్యక్షుడు మరణించినా లేదా రాజీనామాచేసినా తిరిగి నూతనముగా అధ్యక్షుడు ఎన్నుకోబడే వరకు, అధ్యక్షుని అధికారాలు ఉపాధ్యక్షునికి సంక్రమించును. ఉపాధ్యక్షుడు కూడా హాజరు కాని సందర్భంలో కమిటీ సభ్యులలోని సీనియర్ సభ్యునికి అధ్యక్షుని అధికారాలు సంక్రమించును.



Scanned by CamScanner

26. కార్యదర్శి అధికారాలు మరియు బాధ్యతలు :-

కార్యదర్శి అధికారాలు మరియు బాధ్యతలు :- కార్యదర్శి సంఘ పరిపాలన మరియు నిర్వహణకు సంబంధించిన అధికారములు

ఎ) అధ్యక్షుని అజమాయిషీకి లోబడి కార్యదర్శి సంఘ పరిపాలన మరియు నిర్వహణకు సంబంధించిన అధికారములు కలిగి ఉండును. సంఘం తరపున వ్యాజ్యములు వేయుటకు గాని లేక సంఘంపై వేయబడిన వ్యాజ్యములను ఎదుర్కొనుటకుగాని కార్యదర్శికి అధికారం కలదు. సంఘం పేర వ్రాయబడు పత్రములు, దస్తావేజులు/ అధ్యక్షుడు మరియు కార్యదర్శి ఆధీనంలో ఉండును.

బి) పాలకవర్గం లేదా అధ్యక్షుడు దఫదఫాలుగా దత్తం చేయు అధికారాలను కార్యదర్శి చెలాయించును.

సి) పాలకవర్గం వారు నిర్ణయించిన పరిమితులకు లోబడి బ్యాంక్ ఖాతాలపై లావాదేవీలు జరుపుటకు అధికారం ఉండును.

డి) సంఘమునకు సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరములు నడుపుటకు అధికారము మరియు ఖాతాల పుస్తకములను, రిజిష్టర్లను వ్రాయించుటకు బాధ్యత కలిగి ఉండును.

ఇ) ఉపనిబంధనల మేరకు సంఘ వ్యాపారాన్ని నిర్వహించవలెను.

ఎఫ్) డిపాజిట్లను సేకరించుటకు, సేకరించిన డిపాజిట్లకు సంబంధించి రూపొందించబడిన నిబంధనల మేరకు డిపాజిట్ సర్టిఫికేట్‌లను జారీచేయుటకు మరియు గడువు ముగిసిన డిపాజిట్ మొత్తాలను వడ్డీతో సహా చెల్లించుటకు అధికారం కలిగి ఉండును.

జి) బడ్జెట్ కేటాయింపులకు లోబడి, ప్రతి పద్దుకు పాలకవర్గం నిర్ణయించిన పరిమితులకు లోబడి, కంటింజెంట్ (చిల్లర) ఖర్చులను చేయుటకు అధికారం కలిగి ఉండును.

హెచ్) సంఘ సభ్యత్వం కోరే అభ్యర్థుల నుండి దరఖాస్తులను తీసుకొని, వాటిని రికార్డు చేసి, పాలకవర్గమునకు సమర్పించవలెను.

ఐ) సంఘమునకు సభ్యులు చెల్లించిన మొత్తములకు సంఘం పేరున ఉండే రశీదులు ఇవ్వవలెను. (సంఘం పేర ఇవ్వబడే రశీదులు, ధృవపత్రాలు, బాండ్లు మొదలగు వాటిపై కార్యదర్శితోపాటు పాలకవర్గంలోని ఇద్దరు సభ్యులు, ప్రత్యేకించి ఆ ఇద్దరిలో ఒకరు అధ్యక్షుడు లేక ఉపాధ్యక్షులు సంతకం చేయవలెను)

జె) సంఘ వ్యాపార నిర్వహణకు సంబంధించిన ఓచర్లను, రశీదులను, ఆస్తి అప్పుల వట్టికను, ఇతర అవసరమైన పత్రములను లేక నివేదికలను తయారుచేయుటకు కార్యదర్శి బాధ్యుడై యుండవలెను.

కె) రిజిస్ట్రార్‌చే కోరబడు ఇతర పత్రములు, పట్టికలు, నివేదికలు తయారు చేయించి పంపించు బాధ్యత కార్యదర్శిపై కలదు.

ఎల్) మహాజన సభ జరుపుటకు ముందు మరియు ఎన్నికలు జరుపుటకు ముందు బైలాలో నిర్దేశింపబడిన రీతిలో



Scanned by CamScanner

ఓటు హక్కు కలిగిన లేదా ఓటు హక్కులేని సభ్యుల జాబితాను తాయారుచేసి పాలకవర్గం అనుమతితో సంఘ ముఖ్య కార్యాలయం మరియు దాని శాఖల నోటీస్ బోర్డులందు ఉంచవలెను.

**27 మహాజన సభ సమావేశం :**

అ) సంఘ మహాజనసభను పాలకవర్గం ఎప్పుడైనను ఏర్పాటుచేయవచ్చును. అయితే ప్రతి సహకార సంవత్సరంలో అర్థసంవత్సరానికొకటి చొప్పున రెండు మహాజనసభ సమావేశాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయవలెను.

ఆ) కనీసం 15 రోజుల ముందుగా మహాజన సభ సమావేశపు నోటీసు, కాలము, స్థలము, తేది మొదలగు వివరాలతో పంపవలెను. అట్టి నోటీసును సభ్యులకు సంఘ వ్యవహారిక విస్తీర్ణంలోని అన్ని గ్రామాలలో దండోరా వేయుట ద్వారాకాని, వ్యక్తిగతంగా లేఖలను అందజేయుట ద్వారాగాని, లేక రిజిస్టారు పోస్టు ద్వారా కాని తెలియపరచవలెను.

ఇ) మహాజనసభ సమావేశానికి కనీస హాజరు (కోరం) మొత్తం సభ్యులలో 10వ వంతుగా ఉండవలెను.

ఈ) మహాజన సభ సమావేశానికి అధ్యక్షుడు గాని, ఉపాధ్యక్షుడు గాని, వారు లేని పక్షంలో సమావేశానికి హాజరైన పాలకవర్గ సభ్యులలో సీనియర్ సభ్యుడు గాని అధ్యక్షత వహించవలెను ;

ఉ) ఏదేని తీర్మానం పై ఓట్లు సమానంగా వచ్చినప్పుడు సభాధ్యక్షునికి కాస్టింగ్ ఓటు (రెండవ ఓటు ) ఉండును.

**28. మహాజన సభ అధికారాలు :-**

సంఘంపై తుది అధికారం తెలంగాణా రాష్ట్ర సహకార సంఘాల చట్టం, 1964 కు లోబడి మహాజనసభ (సర్వ సభ్య మండలి) పరమై ఉండును. అయితే సహకార సంఘాల చట్టం, నిబంధనలు, బైలాల ద్వారా పాలకవర్గానికి గాని లేదా సంఘంయొక్క ఏ ఇతర అధికారికి గాని సంక్రమించిన అధికారాలను వినియోగించుటకు మహాజనసభ తన అధికారాలతో భంగం కలిగించరాదు. సంఘ వ్యవహారాలను పరిష్కరించుటకు పాలకవర్గము సహకార సంవత్సరంలో రెండు పర్యాయాలు మహాజనసభను విధిగా సమావేశపర్చవలెను. ఈ చట్టంలోని ఇతర నిబంధనలకు లోబడి సర్వసభ్య మండలికి ఈ క్రింది అధికారాలు ఉండును.

1) సభ్యులను తొలగించుట; మరియు కమిటీ సభ్యుల ఎన్నిక మరియు తొలగించుట;

2) రిజిస్ట్రార్‌కు వార్షిక నివేదికలు సమర్పించుట;

3) ఆడిట్ రిపోర్ట్, వార్షిక నివేదికల పరిశీలన;

4) నికర లాభాలను పరిష్కరించుట;

5) నిబంధనావళి సవరణ;

6) సభ్యుని బహిష్కరించుట;



Scanned by CamScanner

7) ఆదాయ వ్యయాలకు సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ఆమోదించుట;

8) ఆర్థిక సహాయం చేయు బ్యాంక్‌కు లేదా ఇతర సంఘాలకు సంఘాన్ని అనుబంధీకరించుట ;

9) ఫైనాన్సింగ్ బ్యాంక్ లేక ఇతర సొసైటీలకు తమ సొసైటి తరపున ప్రతినిధులను ఎంపిక చేయుట; మరియు పాలకవర్గ సభ్యులు లేక వారి దగ్గరి బంధువులకు ఇవ్వబడిన అడ్వాన్సులు, అప్పులను సమీక్షించుట; వారు సంఘముతో జరిపిన వ్యాపారమును సమీక్షించుట; వారి నుండి సంఘానికి బకాయిలు ఉన్నట్లయితే ఆ విషయమును రిజిస్ట్రార్‌కు రిపోర్టు చేయుట

10) అంతర్గత ఆడిటర్లను నియమించుట;

11) అంతర్గత ఆడిటర్ల నివేదికను పరిశీలించుట;

12) సహకార విద్యానిధిని ఏర్పాటు చేయుట;

13) సెక్షన్ 50 క్రింద ప్రత్యేక ఆడిట్ నివేదికను, సెక్షన్ 51 కింద చేయబడిన విచారణ నివేదికను, సెక్షన్ 52, 53ల క్రింద చేయబడిన తనిఖీ నివేదికలను పరిశీలించుట మరియు చర్యలుగైకొనుట

14) పారుబాకీలపై నిర్ణయం తీసుకొనుట;

15) సరుకు మరియు నగదు నిల్వలలోని లోటును భర్తీ చేయుటకు ఏర్పాట్లు చేయుట;

16) పర్యవేక్షక మండలిని ఏర్పాటు చేయడం, దాని విధులు, బాధ్యతలను నిర్ధారించడం మరియు దాని నివేదికలను పరిశీలించుట;

17) సంఘ ఆస్తులు, అప్పుల బదలాయింపు, సంఘ విభజన లేక మరొక సంఘంలో విలీనంపై నిర్ణయం తీసుకొనుట;

18) పాలకవర్గ సభ్యుల సమావేశపు హాజరును సమీక్షించుట;

19) సభ్యత్వమును సమీక్షించుట;

20) సిబ్బంది నియమావళిని, వారికి చెల్లించాల్సిన జీతభత్యములను మరియు సాదర ఖర్చులను పరిపాలన మరియు కాంటింజెంట్ నిధికి లోబడి ఆమోదించి రిజిస్ట్రార్ ఆమోదమునకు పంపుట; పై 8,9 అంశములకు సంబంధించిన అధికారములను మహాజన సభ పాలకవర్గమునకు దత్తం చేయవచ్చును.

**29. ఆడిట్ :-**

సంఘం ఆర్థిక సంవత్సరం ముగిసిన ఆరు నెలలలోపు సహకార శాఖ అధికార ఆడిటర్లతో ఆడిట్ చేయించుకొని మహాజనసభకు సమర్పించవలెను.

**30. ఉద్యోగుల సర్వీసు నిబంధనలు :-** ఉద్యోగులను భర్తీచేసే విధానం, సర్వీస్ నిబంధనలు, భర్తీచేసే



Scanned by CamScanner

అధికారం, పేస్కేళ్ళు మరియు అలవెన్సులు, క్రమశిక్షణా చర్యలకు సంబంధించిన విధానము మొదలైన అంశాలకు సంబంధించి సంఘ పాలకవర్గం ప్రత్యేక నిబంధనలను రూపొందించి, మహాజనసభ మరియు రిజిస్ట్రార్ ఆమోదముతో అమలు చేయవలెను. ఈ విధంగా రూపొందించబడిన ఉప నిబంధనలు సంఘ మినిట్స్ పుస్తకంలో నమోదు చేయబడవలెను.

**31. బైలాల సవరణ :**

ఎ) సంఘం తన ప్రసుత్త బైలాలలో కొన్ని మార్పులు చేర్పులు చేయాల్సిన అవసరముందని భావిస్తే తెలంగాణా రాష్ట్ర సహకార సంఘాల చట్టం, 1964 నిబంధనలకు లోబడి జనరల్ బాడీ ఆమోదంతో చేసుకోవచ్చు. అయితే అలా సవరించబడిన నిబంధనావళిని రిజిస్ట్రేషన్ నిమిత్తము రిజిస్ట్రారుకు పంపవలెను. రిజిస్ట్రార్‌కు పంపే దరఖాస్తుపై సంఘ అధ్యక్షునితో పాటు మరో ఇద్దరు పాలకవర్గ సభ్యులు సంతకం చేయవలెను. దరఖాస్తులో ఈ దిగువ సూచించిన వివరములు ఉండవలెను.

1. సవరణలను ఆమోదించిన జనరల్‌బాడీ సమావేశం జరిగిన తేది.
2. జనరల్ బాడీ సమావేశానికి సభ్యులకు నోటీసు జారీ చేసిన తేది.
3. జనరల్ బాడీ సమావేశం జరిగిన తేదీ నాటికి మొత్తం సంఘ సభ్యుల సంఖ్య
4. సమావేశానికి హాజరైన సభ్యుల సంఖ్య
5. సవరణలకు ఆమోదం తెలిపిన సభ్యుల సంఖ్య నిబంధనావళిలో సవరణలను మహాజనసభ ఆమోదించిన 30 రోజుల లోపల ఆ తీర్మానమును రిజిస్ట్రార్‌కు పంపవలెను.

బి) అయితే, సంఘ శ్రేయస్సు దృష్ట్యా సంఘ బైలా దేనికైనా / సవరణ అవసరమని రిజిస్ట్రార్ భావించిన ఎడల అట్టి సవరణను చేయవలసిందిగా సంఘమును ఆదేశించవచ్చును. లేదా అట్టి సవరణను తానే చేస్తూ సంఘమునకు సమాచారం పంపవచ్చును. ఈ ప్రకారం చేయబడిన సవరణకు కూడా బైలాలలోని ఇతర అంశాల మాదిరిగానే ప్రభావము ఉండును.

**32. సభ్యేతరులతో వ్యాపారము :-**

సంఘం సంఘ సభ్యేతరులతో కూడా వ్యాపారం చేయవచ్చును. కాని సభ్యేతరులు వారి కొరకు నిర్ణయింపబడిన సంఘ సేవలను పొందుటకు మాత్రమే అర్హులు. సభ్యేతరులకు సంఘం సంపాదించిన లాభంలో వాటా పొందుటకు గాని, సంఘ సమావేశంలో లేదా ఎన్నికలలో పాల్గొని ఓటు వేయుటకు గాని, ఎన్నికలలో పోటీ చేయుటకు గాని ఎలాంటి హక్కులు ఉండవు.

**33. లాభముల పంపిణీ :-**

చీఫ్ ఆడిటరుగాని, ఆయన అధికారము పొందిన వేరొకరుకాని ప్రకటించిన నికర లాభమును, ఆడిటు సర్టిఫికెటు



Scanned by CamScanner

జారీచేయబడిన పిమ్మట యీ దిగువ చూపిన విధముగా పంపిణీ చేయవలెను.

1. సహకార విద్యానిధి : రూల్ 36 (ఏ)లో నిర్ణయించిన గరిష్ఠ పరిమితికి లోబడి ప్రతి సంవత్సరం స్థూల లాభం లేక స్థూల ఆదాయంలోని ఒక శాతాన్ని సహకార విద్యానిధికి జమ చేయవలెను. దానిలో 30 శాతం ప్రతి సంవత్సరం ఆడిట్ నివేదిక అందిన 30 రోజులలోగా లేదా అక్టోబర్ 31వ తేదీలోగా ఏది ముందు అయితే ఆ తేదీలోపల తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్‌కు చెల్లించాలి. మిగిలిన 70 శాతంలో 50 శాతం సభ్యుల విద్యకు, 20 శాతం సిబ్బంది శిక్షణకు వినియోగించవలెను.

2. సంఘం ఒక సంవత్సరంలో స్థూల లాభంలో 30 శాతానికి మించకుండా లేదా నిర్వహణ మూలధనంలో 2 శాతం ఇందులో ఏది తక్కువైతే ఆ మొత్తమును తన ఉద్యోగుల జీతభత్యములు మరియు కంటింజెంట్ కొరకు "పరిపాలన మరియు కంటింజెంట్ నిధికి" జమ చేయవలెను.

3. నికరలాభంలో 25 శాతానికి తగ్గకుండా క్షేమనిధికి జమచేయవలెను.

4. నికరలాభంలో మహాజనసభ నిర్ణయించిన మొత్తమును 5 శాతానికి తగ్గకుండా 10 శాతం వరకు పారుబాకీల నిధికి తప్పక జమచేయవలెను.

5. మిగిలిన దానిలో గత సంవత్సరం మార్చి 31వ తేదీన తమ ఖాతాలో నిల్వ ఉన్న సభ్యుల వాటాధనంపై లాభంలో 15 శాతానికి తక్కువ కాకుండా డివిడెండ్‌ను పంచవలెను.

6. మహాజనసభ పాలకవర్గం సిఫారసుపై సంఘ సిబ్బందికి ఒక నెలజీతం మొత్తానికి మించకుండా బోనస్ చెల్లించవచ్చును.

7. లాభంలో 10 శాతానికి మించకుండా సాముదాయక ప్రయోజన నిధికి జమకట్టవచ్చును. ఈ మొత్తమును తెలంగాణ హిందూమత సంస్థల మరియు దేవాదాయ చట్టం 1987లోని సెక్షన్ 2లో నిర్దేశించిన ఉద్దేశ్యములకు వినియోగించవచ్చును.

8. లాభంలో 10 శాతానికి మించని మొత్తమును మహాజనసభ వారి నిర్ణయానుసారం భవన నిధికి చేర్చవచ్చును.

9. ఇంకనూ పంపిణీ కాకుండా మిగిలిఉన్న లాభాన్ని సంక్షేమ నిధికి జమకట్టవలెను.

**34. క్షేమనిధి :-** అనుకోని నష్టాలను ఎదుర్కొనుటకు మాత్రమే ఏర్పాటు చేయబడే క్షేమనిధిపై సభ్యులకు ఎలాంటి హక్కు ఉండదు. అయితే సంఘ నష్టాలను భర్తీ చేయాలనుకుంటే రిజిస్ట్రార్ అనుమతితో ఈ క్షేమ నిధిని వాడుకోవచ్చు. ఒకవేళ సంఘం రద్దయితే ఈ క్షేమనిధిని లిక్విడేటర్ వశం/పరం చేయవలెను.

**గమనిక :** సంఘం నుండి రావాల్సిన బకాయిలను ఎవరేని సభ్యుడు భారత కాలదోష చట్టం ప్రకారం గడువు లోపల తీసుకోనట్లయితే ఆ మొత్తాలను కూడా క్షేమనిధికి జమచేయవలెను.

**35. బకాయిదారుల జాబితా ప్రకటన :-**



Scanned by CamScanner

సంఘ కార్యదర్శి ప్రతి అర్థ సంవత్సరం ప్రారంభమగుటకు ముందు అనగా ఏప్రిల్ మరియు అక్టోబర్ మాసములందు సంఘానికి సభ్యులనుండి రావలసిన మొత్తాల జాబితా తయారుచేసి, అట్టి మొత్తాలను సకాలంలో చెల్లించవలసినదిగా బకాయిదారులైన సభ్యులకు నోటీసు జారీచేయవలెను. గడువులోపల చెల్లించని సభ్యుల జాబితాను సంఘ ముఖ్య కార్యాలయమునందు అంటించవలెను. తదుపరి పాలకవర్గ సమావేశంలో బకాయిదారుల జాబితాపై చర్చించడంతోపాటు, మహాజనసభలో వారి పేర్లను చదివి వినిపించవలెను.

**36. సభ్యుల జాబితా :-**

సహకార సంవత్సరం చివరిరోజున సంఘంలో ఉన్న సభ్యుల వివరాలను తెలియపరిచే జాబితాను సహకార సంవత్సరం ముగిసిన నెలరోజుల లోపు తయారుచేయవలెను. అందులో ప్రవేశ సంఖ్య, సభ్యుని పేరు, తండ్రిలేక భర్త పేరు, చిరునామా పొందుపరచవలెను. సభ్యులలో ఎవరైనా అట్టి జాబితాను పరిశీలించదలచుకుంటే సంఘ పనివేళల్లో వారికి అందుబాటులో ఉంచవలెను. జాబితా నకలును ఎవరేని సభ్యుడు కోరితే నిర్ణీత రుసుమును వసూలు చేసిన పిదప కార్యదర్శి విధిగా ఇవ్వవలెను.

**37. నివేదికలు :** సంఘం ప్రతి సంవత్సరం రిజిస్ట్రార్ సూచించిన పద్ధతిలో ఈ క్రింది నివేదికలను తయారుచేయవలెను.

ఎ) జమా ఖర్చుల పట్టిక

బి) లాభనష్టాల పట్టిక

సి) ఆస్తి అప్పుల పట్టిక

డి) రిజిస్ట్రార్‌చే సందర్భానుసారంగా కోరబడే ఇతర నివేదికలు

పై నివేదికల నకలును సహకార సంవత్సరం ముగిసిన పిదప 15 రోజులలోగా రిజిస్ట్రార్‌కు సమర్పించవలెను.

**38. సహకార సంఘాల చట్టం, నిబంధనలు, బైలాలు అందుబాటులో ఉంచాలి**

సంఘములు తెలంగాణా రాష్ట్ర సహకార సంఘాల చట్టం, 1964, సంఘ బైలాలు, గడచిన సంవత్సరము తాలూకు ఆడిట్ అయిన ఆస్తి అప్పుల పట్టిక, సముచిత వేళలో, సంఘ ప్రధాన కార్యాలయములో అందుబాటులో నుంచవలెను. సభ్యులెవరైనా తమకు సంబంధించిన వివరములుగల అక్కౌంట్లను, రికార్డులను తనిఖీ చేయదలచిన యెడల, సదరు సభ్యులను సంఘము అనుమతించవలెను.

**39. సంఘ ఆవరణను సంఘేతర కార్యక్రమాలకు వినియోగించరాదు :**

సంఘమునకు సంబంధించిన కార్యకలాపములకు తప్ప, మరే యితర కార్యక్రమములకు సంఘము తాను సంఘ కార్యాలయ ఆవరణను వాడుకొనకూడదు; ఇతరులు వాడుకొనుటకు అనుమతించకూడదు.

**40. దొంగిలింపబడిన లేదా కనబడకుండా పోయిన ఆస్తులను రద్దుచేయుట :**



Scanned by CamScanner

సంఘ ఆస్తులేమైన తస్కరింపబడినా లేక పోయియుండి తిరిగి అవి దొరుకుటకు అసాధ్యమైన యెడల మహాజనసభ అట్టి వస్తువుల విలువను రద్దు చేయవలెను.

**41. ఇతరములు :**

సంఘ నిధుల లభ్యతను బట్టి సభ్యులకు అప్పులు ఇవ్వడంలో మరియు అప్పుల వసూళ్ళలో పాలకవర్గం సరియైన మార్గదర్శకాలను ఏర్పాటు చేసుకొని అమలుపర్చవలెను. అప్పులపై వసూలు చేయదగిన వడ్డీ, వాయిదాల కాలపరిమితి తదితర అంశములపై సంఘం ప్రత్యేక నిబంధనలను ఏర్పాటు చేసుకోవలెను.

అదే విధంగా సభ్యుల నుండి వసూలు చేసిన మొత్తానికి సభ్యునికి సంఘం తరపున అధ్యక్షుడు లేదా కార్యదర్శి సంతకముతో రశీదు ఇవ్వవలెను. సంఘ వ్యవహారాలను సాధ్యమైనంతవరకు చెక్కు రూపంలో నిర్వహించవలెను.

పాలకవర్గ సభ్యులు ఉచితంగానే సేవలు అందించవలెను.

సంఘం నిర్వహించే వివిధ వ్యాపారాలకు సంబంధించి వ్యాపార ప్రణాళికలను రూపొందించుకొని తదనుగుణంగా అమలు చేయవలెను.

**గమనిక :** బైలాలలో చెప్పబడని అంశాల ప్రస్తావన వచ్చినప్పుడు ఆ కాలంలో అమలులో ఉన్న తెలంగాణ సహకార సంఘాల చట్టం, 1964లోని సెక్షన్లు మరియు రూల్స్‌ను అనుసరించవలెను. కాలానుగుణంగా చట్టంలో వచ్చే మార్పులకు అనుగుణంగా ప్రతి సంఘం బైలాలను సవరించుకోవలెను. చట్ట సవరణలు జరిగినప్పుడల్లా తదనుగుణంగా బైలాలు సవరింపబడినట్లు భావించవలెను. బైలాలలోని అంశాలు చట్టానికి, అందులోని నియమాలకు విరుద్ధంగా ఉన్నట్లయితే చట్ట నిబంధనలే చెల్లుబాటు అవుతాయి.

****



Scanned by CamScanner

**సహకార సూత్రములు :**

వ్యక్తులు ఐచ్ఛికంగా, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అవసరాలు, కోరికల సాధన కొరకు కొంతమంది సమిష్టిగా కలిసి వ్యాపారం చేసుకున్న ఉమ్మడి యాజమాన్యం, ప్రజాస్వామ్య నిర్వహణచేత స్వయంప్రతిపత్తి కలిగినదే సహకార సంస్థ

**ప్రాథమిక సహకార సూత్రాలు :**

ఎ. **స్వచ్ఛాపూర్వక మరియు ఐచ్ఛిక సభ్యత్వం :** సంఘ సేవలను పొందడానికి, సభ్యత్వ బాధ్యతలను నిర్వహించుకోదలచినవారికి లింగ, సాంఘిక, జాతి, రాజకీయ, మత, వివక్షత లేకుండా సభ్యత్వం లభింపజేయు ఐచ్ఛిక సంస్థలు సహకార సంఘములు.

బి. **సభ్యులచే ప్రజాస్వామ్య నియంత్రణ :** సంఘాలు సభ్యులచే నిర్వహింపబడు ప్రజాస్వామ్య సంస్థలు. విధానాల రూపకల్పన, నిర్ణయాలు చేయడంలో సభ్యులు చురుకుగా పాల్గొనాలి. ప్రతినిధులుగా ఎన్నికైన స్త్రీ, పురుష ప్రతినిధులు సభ్యులకు పూర్తిగా బాధ్యత వహించవలెను.

సి. **సభ్యుల ఆర్థిక భాగస్వామ్యం :** సంఘాల మూలధనం సభ్యులచేత సమానంగా సమకూర్చబడి, ప్రజాస్వామ్య ప్రాతిపదికపైన అజమాయిషీ చేయబడును.

డి. **స్వతంత్ర ప్రతిపత్తి, స్వేచ్ఛ :** సంఘాలు స్వతంత్ర ప్రతిపత్తి గల స్వయం పోషక సంస్థలు. అవి వాటి సభ్యులచే నిర్వహించబడును.

ఇ. **విద్య, శిక్షణ, సమాచారం :** సంఘాలు తమ అభివృద్ధికి తోడ్పడేందుకు పాలకవర్గాలకు, సభ్యులకు, ఉద్యోగులకు విద్య, శిక్షణ, సమాచారం ఇవ్వగలవు.

ఎఫ్. **సహకార సంఘాల మధ్య సహకారం :** సంఘాలు తమ సభ్యులకు సమర్థవంతమైన సేవలందించేందుకు సహకారోద్యమాన్ని పటిష్టపరిచేందుకు స్థానిక, జాతీయ, ప్రాంతీయ, అంతర్జాతీయ సంస్థల ద్వారా కలిసికట్టుగా వ్యవహరించగలవు.

జి. **సమాజ శ్రేయస్సు :** సంఘాలు సభ్యుల అనుమతి పొందిన విధానాల ద్వారా వారి సమాజ సమగ్రాభివృద్ధికి సేవలందించును.

**విలువలు :** సంఘాలు స్వయం సహాయం, స్వయం బాధ్యత, ప్రజాస్వామ్యం, సమానత్వం, ఏకత్వం ఆధారంగా పనిచేస్తాయి. సభ్యులు నైతికవిలువలైన నిజాయితీ, నిష్కపటం, సాంఘిక బాధ్యత, మరియు పరోపకారాల పట్ల నమ్మకం కలిగి ఉంటారు.

Scanned by CamScanner